కుక్కలు కరుస్తున్నయ్..!



భీమిని మండలం ఖర్జీభీంపూర్‌లో శనివారం ఇద్దరు చిన్నారులు ఠాకూర్ ఆనంది, టేకం రక్షితలపై పిచ్చి కుక్క దాడి చేసి గాయపర్చింది. అనంతరం పశువులపై దాడులకు దిగాయి. ఇదే మండలంలోని బిట్టుర్‌పల్లి, వెంకటపూర్, సుర్జాపూర్ గ్రామాల్లో గత నెలలో వీధి కుక్కలు స్థానికులను కరిచాయి. లింగాల, కుర్మగూడెం గ్రామాల్లో కుక్కల దాడుల్లో మేకలు మృతి చెందాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా వీధి కుక్కలు మూగజీవాలు, మనుషులపై దాడులకు దిగుతూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి.





రాత్రి పూట గ్రామంలో రోడ్డు పై సేదతీరుతున్న శునకాలు

- గుంపులుగా తిరుగుతూ మనుషులు, మూగజీవాలపై దాడులు
- బయటికెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లిరూరల్: శునకాల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎటుచూసినా కుక్కలు గుంపులుగా దర్శనమిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. బయటికెళ్లాలంటే జనం జంకుతున్నారు. ఎటు నుంచి ఏ శునకం దాడి చేస్తుందో తెలియక, భయంభయంగా తిరగాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బెల్లంపల్లి మండల పరిధిలోని 17గ్రామ పంచాయతీల్లో దాదాపు 820శునకాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గడిచిన మూడు నెలల్లో దాదాపు 68మంది గ్రామీణులపై దాడి చేసి గాయపర్చాయి.

గుంపులు గుంపులుగా...

గ్రామాల్లోని వాడవాడనా గుంపులు గుంపులుగా గ్రామ సింహాలే తిరగాడుతూ కనిపిస్తున్నాయి. గతంలో మాదిరిగా శునకాలను మట్టుపెట్టే చర్యలు లేకపోవడంతో, వాటి సంఖ్య రోజురోజుకి పెరిగిపోతోంది. గ్రామాల్లో కుక్కల నివారణకు తాత్కాలిక చర్యలు చేపట్టినా, అవి ఏమాత్రం ప్రయోజనకరంగా ఉండడం లేదు. కుక్కలు పట్టే ప్రత్యేక బృందాలతో వాటిని పట్టించి, నిర్మానుష్య ప్రదేశంలో దూరంగా వదిలిపెట్టినప్పటికీ వారం తిరగకుండానే మళ్లీ కుక్కల గుంపులు దర్శనమిస్తున్నాయి. గతంలో గ్రామాల్లో తిరగాడిన కుక్కలను వేరే చోట వదిలివేస్తున్నప్పటికీ, వేరే ఎక్కడి నుంచో వచ్చిన కుక్కలు స్థానికులను గుర్తించలేక వారిపై క్రూరంగా దాడులకు పాల్పడుతున్నాయి.

వైరస్ సోకిన కుక్కలే అధికం...

సాధారణంగా కుక్క కాటే ప్రమాదకరం అనుకుంటే, గ్రామాల్లో తిరుగుతున్న కుక్కల్లో చాలా వాటికి వైరస్ సోకి రోగాల బారిన పడినవే అధికంగా ఉన్నాయి. అటువంటివి కరిస్తే ఇంకా ప్రమాద తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పశువైద్యాధికారులు కూడా ఈ కుక్కల రోగాల పై దృష్టి సారించడం లేదని విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో తిరిగి వైరస్ బారిన పడిన కుక్కలను గుర్తించి, వాటి వ్యాధికి నివారణ చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని గ్రామాల నుంచి వేరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శాశ్వత చర్యలపై దృష్టి సారిస్తేనే...

గ్రామాల్లో కుక్కల బెడద నివారించేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసలే సీజనల్ వ్యాధులతో సతమతవుతున్న ప్రజానీకానికి ఈ శునకాల దాడులు మరింత ఇబ్బందికరంగా మారాయి. శునకాలను వేరే చోటుకు తరలించేలా తాత్కాలిక చర్యలు చేపడుతున్నా, అధికారులు వాటిని శాశ్వతంగా గ్రామాల్లోకి రాకుండా చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో శునకాల బాధ లేకుండా చూసి ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దండేపల్లిలో కుక్కల భయం!



దండేపల్లి: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. దారివెంట నడుచుకుంటూ వెళ్లే వారితో పాటు, సైకిళ్లు, ద్విచక్ర వాహనదారులు సైతం కుక్కలకు భయపడుతున్నారు. నడుచుకుంటూ వెళ్లినా, బైక్‌లపై వెళ్లినా వెంబడిస్తూ మీదపడి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు కుక్కలను చూస్తే వణికి పోతున్నారు. అధికారులు స్పందించి, కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కలను నివారించాలి



గ్రామాల్లో కుక్కల సంతతి ఎక్కువై రోజురోజుకు బెడద పెరిగి పోతోంది. వ్యాధులు సోకిన కుక్కలు ప్రజలపై దాడులకు దిగి బెంబేలెత్తిస్తున్నాయి. గ్రామీణులు రోడ్ల పైకి రావాలంటే హడలిపోతున్నారు. కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, వాటి బెడద లేకుండా చూడాలి.

– చల్లూరి దేవదాస్, మాలగురిజాల, బెల్లంపల్లి మండలం

భయాందోళనకు గురి చేస్తున్నాయి



రాత్రి, పగలు రోడ్లపై కుక్కలు తిష్ట వేసి, రోడ్డు పై పయనించే బైక్ లు, వాహనాల వెంబడి పడి ప్రయాణికులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. కొన్నిసార్లు బైక్‌లు అదుపు తప్పి వాహనదారులు కిందపడిన ఘటనలు ఉన్నాయి. కుక్కలను నివారించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– చిలుముల సాయి కుమార్, గురిజాల , బెల్లంపల్లి మండలం

కళ తప్పిన చిల్డ్రన్స్‌పార్క్

- పాడైపోతున్న జంతువుల బొమ్మలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బస్తీ చిల్డ్రన్స్ పార్క్‌లో ఏర్పాటు చేసిన జంతు బొమ్మలు క్రమంగా పాడవుతున్నాయి. చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభించిన ఏడాది కాలంలోనే చాలా మట్టుకు బొమ్మల రంగులు చెదిరిపోగా, ఒక్కో బొమ్మ ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. రంగులతో చిన్నారులను ఆకట్టుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. చిల్డ్రన్స్‌పార్క్‌కు రోజువారీగా పదుల సంఖ్యలో చిన్నారులను ఆటవిడుపు కోసం తల్లిదండ్రులు తీసుకు వస్తుంటారు. ఆదిలో కొంతవరకు ఆట వస్తువులు, జంతువుల బొమ్మలు బాగానే ఉన్నా, అనతి కాలంలోనే రూపాంతరం చెందడం ప్రారంభించాయి. కొంగలు, పులి, ఏనుగు, నెమళ్లు తదితర రకాల జంతు బొమ్మలు విరిగిపోయి కళావిహీనంగా తయారయ్యాయి. ఆ తీరుగా మారిన బొమ్మల్లో కొన్నింటిని పార్క్ నుంచి తొలగించి ఎంచక్కా చెత్త బండిలో డంప్ యార్డుకు తీసుకువెళ్లి పడేశారు. పార్క్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో చిల్డ్రన్స్ పార్క్‌కు వచ్చే పిల్లల సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా తగ్గింది. ఆట వస్తువులు, బొమ్మలు సరిగా లేకపోవడంతో చిన్నారులను ఆకర్షించలేక పోతున్నాయి. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్తబండిలో డంప్‌యార్డుకు తరలిస్తున్న నెమలి బొమ్మ

మహిళ అదృశ్యం



జెడ లక్ష్మి(ఫైల్)

వేమనపల్లి: మండలంలోని బుయ్యారానికి చెందిన జెడ లక్ష్మి ఈ నెల 26న బెల్లంపల్లిలో అదృశ్యమైందని భర్త రాజ లింగు తెలిపారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై శ్యాంపటేల్ కేసు నమోదు చేసుకొని వివరాలు వెల్లడించారు. లక్ష్మి నాలుగు నెలలుగా మానసిక వ్యాధితో బాధపడుతుందన్నారు. 26వ తేదీన తాను పొలం పనులకు వెళ్లగా, లక్ష్మి ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. కన్నెపల్లి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లి ఆటోలో బెల్లంపల్లికి వెళ్లిందని చూసిన వారు చెప్పారన్నారు. బెల్లంపల్లిలో ఆటో దిగి, డ్రైవర్‌కు డబ్బులు ఇవ్వకుండా పరారైనట్లు ఆమె ఆచూకీ కోసం తిరగడం మూలంగా ఆలస్యంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఒకసారి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయేటప్పుడు ఎర్రచీర, నలుపురంగు జాకెట్ ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నం.8096552340కు సమాచారం ఇవ్వాలన్నారు.

బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండ, పెద్దంపేట, బుద్ధిపల్లి, టీకానపల్లి, హాజీపూర్, పడ్తనపల్లి, కర్ణమామిడి గ్రామాల్లోని మహిళలకు ఆదివారం కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో బతకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్క మహిళ ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండగ జరుపుకోవాలని చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. చీరల పంపిణీ కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్‌రావు సోదరీమణులు రుక్మిణీ, సత్యశ్రీతో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి, మాజీ జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, మాధవరపు రాజేశ్వర్‌రావు, ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.



కర్ణమామిడిలో చీరలు అందజేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరు, ఇటిక్యాల, మోదెల వార్డుల్లో కొక్కిరాల రఘుపతిరావు చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ ఆరీఫ్, నాగభూషణం, చింత అశోక్‌కుమార్, పింగిళి రమేష్ నాయకులు పాల్గొన్నారు.

'అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మంచిర్యాల జిల్లా ర్యాలీ గ్రామంలోని కోలాంగూడలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఏ.లాల్‌కుమార్ మాట్లాడుతూ.. కులం పోవాలి, అందరికీ విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో జ్యోతిరావు పూలే 152సంవత్సరాల క్రితం సత్యశోధక్ సమాజ్ స్థాపించినట్లు తెలిపారు. జననం నుంచి మరణం వరకు కూడా కులం వెంటాడుతోందని, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి కులవివక్ష అడ్డుపడుతోందన్నారు. ప్రజలు చైతన్యమై వ్యతిరేకిస్తేనే కులనిర్మూలన సాధ్యమవుతుందని, ఇందుకు దోపిడీ వ్యవస్థ రద్దు జరిగితేనే కుల వ్యవస్థ రద్ధవుతుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఇఫ్టూ నాయకులు గణేశ్, రహీం, ఏఐకేఎంఎస్ నాయకులలు రవి, శివాజీ, మారు, భీంబాయి, లలిత, హన్మక్క, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న న్యూ డెమోక్రసీ నాయకులు

పంట పొలాలకు వెళ్లేదెలా?



చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర గ్రామంలో పంట పొలాలకు వెళ్లే రోడ్డు చిన్న వర్షం పడినా బురదమయంగా మారి అధ్వానంగా తయారవుతోంది. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వైకుంఠ ధామానికి కూడా ఈ దారి గుండనే వెళ్లాల్సి ఉండగా, ప్రజలకు నరకయాతన తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. చెట్ల కొమ్మలు తొలగించండి..!



వేమనపల్లి: వేమనపల్లి-మంగెనపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా ఏడేళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి కొమ్మలు రోడ్డు పైకి వ్యాపిస్తున్నాయి. పలుచోట్ల మూలమలుపులు ఉండగా, ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి రోడ్లపైకి విస్తరిస్తున్న చెట్ల కొమ్మలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి:
దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో
ఫోన్ నంబర్ : 94408 29155

నీళ్ల చారు.. నల్లా నీరే దిక్కు..!

- సర్కార్ ఆసుపత్రిలో సౌకర్యాలు కరువు





చెన్నూర్ సర్కార్ ఆసుపత్రిలో సౌకర్యాలు కరువయ్యాయి. ఆర్వో ప్లాంట్ చెడిపోవడంతో రోగులు, వారి బంధువులు నల్లా నీరు తాగాల్సిన పరిస్థితి నెలకొంది. అనారోగ్యంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రోగులకు నాసిరకం భోజనం పెడుతున్నారు. నీళ్ల పప్పు, రుచికరంగా లేని కూరలు పెడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లేట్ తెచ్చుకుంటేనే ఆ పూట భోజనం పెడుతున్నారని, లేకుంటే.. ఆ పూట భోజనం పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సందర్శించి తగిన సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన భోజనం పెట్టేలా చూడాలని కోరుతున్నారు. - చెన్నూర్

క్లుప్తంగా

అలరించిన విద్యార్థుల నృత్యం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల వొకేషనల్ (వృత్తి విద్యాకళాశాల) శ్రీసాయి పారామెడికల్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, డైరెక్టర్లు ఆదిత్యసాయి, సాయిక్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ సరికాదు'



నిరసన తెలుపుతున్న నాయకులు

దండేపల్లి: ఎస్సీ వర్గీకరణ దేశంలోని కుల, మతాలపై ప్రభావం చూపుతోందని, ఇది సరికాదని మాలమహానాడు సంఘం నాయకులు పేర్కొన్నారు. దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘనాయకులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చట్ట విరుద్ధమని, దళితుల మధ్య చిచ్చుపెట్టే అంశమని దీనిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దయాకర్, రాజన్న, శ్రీనివాస్, రాకేశ్, జీవన్, వసంతయ్య, మోహన్‌దాస్, నరేష్, అఖిల్, విష్ణు, సుధీర్, మోష తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొక్కిరాల సురేఖ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌండ్ల సంతోశ్ చారి ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు నివాసంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పలువురు ఆయన వెంట కాంగ్రెస్‌లో చేరగా, నస్పూర్ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు తొలికుంట్ల శ్రీనివాస చారి, సజ్జన జగదీశ్వర చారి, ప్రధాన కార్యదర్శి తాటికొండ రాజేశం చారి, కోశాధికారి మాటూరి సత్యనారాయణ చారి, ఉపాధ్యక్షుడు శ్రీమంతుల రాజవీరు, స్వర్ణకార సంఘం నాయకులు శ్రీరామోజు సంతోశ్ చారి, మునిగంటి శ్రీనివాస్ చారి, శ్రీరామోజు రాజా మొగిలి చారి తదితరులు ఉన్నారు.

సారంగపల్లిలో 'పోలీసుల పల్లెనిద్ర'

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగపల్లిలో శనివారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు నేరాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని, మొబైల్ వాడకం, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజశేఖర్ సూచించారు.

ఎంఈవోకు వీడ్కోలు



ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేమనపల్లి: మండలంలో ఎంఈవోగా పని చేసి హాజీపూర్ మండలానికి బదిలీపై వెళ్తున్న తిరుపతిరెడ్డి సేవలు మరువలేనివని మండల ఉపాధ్యాయులు అన్నారు. నీల్వాయిలో మండలంలోని ఉపాధ్యాయులు ఆదివారం సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం నూతన ఎంఈవోగా బాధ్యతలు తీసుకున్న శ్రీధర్‌రెడ్డికి స్వాగతం పలికారు.

చింతలపల్లిలో ఉచిత వైద్య శిబిరం

జన్నారం: మండలంలోని చింతలపల్లిలో ఆదివారం ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 200మందికి పైగా రోగులకు డా.హేమలత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు మేనేజింగ్ డైరెక్టర్ మగ్గిడి తిరుపతి తెలిపారు. అనంతరం వైద్యురాలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఇన్‌చార్జీలు రాము, అజ్మత్‌ఖాన్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందారంలో ఎమ్మెల్యే పర్యటన



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదివారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా నజీర్‌పల్లెతో పాటు పలు వీధుల్లో బైక్‌పై తిరుగుతూ, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్‌లో అంతరాయం కలిగిస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే పల్లెల్లో పర్యటిస్తున్నట్లు విడుతల వారీగా అన్ని సమస్యలను పరిష్కరించనున్నట్లు వివరించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఫయాజ్, గడ్డం ప్రసాద్ గౌడ్, జక్కుల వెంకటేశ్, ఆసంపల్లి శ్రీకాంత్, ఆర్కే సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్‌వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వెంకటేశ్

మందమర్రిరూరల్(రామకష్ణాపూర్): మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన కటుకూరి వెంకటేశ్ కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. ఢిల్లీలోని అశోకహోటల్ చానక్యపురిలో శనివారం నిర్వహించిన నాలెడ్జ్ ఆఫ్ పవర్ సెమినార్ కార్యక్రమంలో పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు గాను ఉత్తరప్రదేశ్ రిటైర్డ్ ఐజీ సత్యేంద్ర కే.ఆర్.సింగ్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి బన్వర్‌సింగ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

ఆదాయపన్ను మాఫీ చేయాలి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): సింగరేణి ఉద్యోగులకు తెరప్స్‌పై ఆదాయపన్ను మాఫీ చేయాలని సీఐటీయూ మందమర్రి బ్రాంచి కార్యదర్శి రామగిరి రామస్వామి డిమాండ్ చేశారు. రామకృష్ణాపూర్‌లోని సీఐటీయూ ఆఫీస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు కార్మిక సంఘం సాధారణ ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన హామీ మేరకు, ఆదాయపన్ను రద్దు చేయాలని, సొంతింటి కళ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆ యూనియన్ నాయకులు రాజేందర్, వెంకటేశ్, విద్యాసాగర్, చైతన్యరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో సభ్యత్వాన్ని తీసుకోండి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: బీజేపీ సభ్యత్వాన్ని పొందాలని ఇందుకోసం ప్రతి ఒక్కరూ 88000 02024 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని వేములబస్తీ, గోపాల్‌వాడల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదును బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, ఎనగందుల కృష్ణమూర్తి, మేనసూరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న తోటి ఆర్ఎంపీలు

భీమిని: మండలంలోని వీగాం గ్రామ పంచాయతీకి చెందిన ఆర్ఎంపీ గాండ్ల పోషన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పోషన్న కుటుంబానికి భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన తోటి ఆర్ఎంపీ, పీఎంపీలు ఆదివారం రూ.40వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.